క్లుప్తంగా

ప్రభుత్వ ఐటీఐలో వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్ వద్ద అతిథులు, ఐటీఐ సిబ్బంది

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఇటీవల పదవీ విరమణ చేసిన ట్రెనింగ్ ఆఫీసర్ డి.ఉమా మహేశ్వరరావు, పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో ప్రభుత్వ ఐటీఐ(పాత)లోని సీ–బ్లాక్ వద్ద శనివారం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథులు రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, అసిస్టెంట్ సాల్మన్ నాయకల్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర రావు, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల ముందు అడ్డంగా ఐరన్ స్తంభాలు


పాలబూత్ సెంటర్‌లో దుకాణాల ముందు పడేసిన ఐరన్ పోల్

సీతంపేట: అమృత్ 2.0 పనులు వ్యాపారులను, వాహన చోదకులను కష్టాలకు గురిచేస్తున్నాయి. నిరంతర తాగునీటి సరఫరా కోసం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో పైపులు వేయడానికి గోతులు తవ్వారు. ఈ మార్గంలో పాలబూత్ సెంటర్ ఎదురుగా తొలగించిన ఐరన్ పోల్స్‌ను రోడ్డుపైన షాపులకు ముందు అడ్డంగా పడేశారు. దీంతో పాలబూత్ సెంటర్‌లో షాపులకు వినియోగదారులు రావడానికి వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపుల ముందు పడవేసిన ఐరన్ పోల్స్ తొలగించాలని గోతులు తవ్వుతున్న వారిని కోరగా.. అది మాపని కాదని, ఐరన్ పోల్స్ జియో కంపెనీ వేసినవని, వారే తొలగించాలని చెప్పడంతో వ్యాపారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఐరన్ పోల్స్ దిగిన భాగంలో కాంక్రీట్ దిమ్మ ఉండటంతో వాటిని తరలించడానికి వీలు కావడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి వ్యాపారాలకు ఇబ్బంది కలగకుండా పోల్స్ తరలించి సహకరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి


క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధాకుమారి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని, సబ్జెక్ట్ మాడ్యూల్‌ను తప్పక అనుసరించాలని సూచించారు. సిబ్బంది ప్రతి రోజూ 9 గంటల లోపే ఫేషియల్ యాప్ వేయాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నిషేధం


మాట్లాడుతున్న వరప్రసాద్

మురళీనగర్: స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులో శనివారం శానిటరీ విభాగం ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి ప్రజలు సహకరించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడొద్దని సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎం.వెంకటరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భాను ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


పోర్టు స్టేడియం పక్కన సర్వీస్ రోడ్డులో డస్ట్ బిన్‌ను ఆనుకుని నిలిపిన ప్రైవేట్ వాహనాలు


తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో ప్రైవేట్ వాహనాల పార్కింగ్


నరసింహనగర్‌లో రహదారిపై పార్క్‌చేసిన కార్లు

ఇరుగ్గా రహదారులు.. ఆపై ఆక్రమణలు

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- అపార్ట్‌మెంట్ల ముందు బారులు తీరుతున్న వాహనాలు
- రాకపోకలకు ఇబ్బందులు.. ట్రాఫిక్ సమస్యలు
- దృష్టి సారించని అధికారులు


80 ఫీట్ రోడ్డులో కేవీ క్వార్టర్స్ పక్కనే డంప్‌చేసిన డెబ్రిస్

తాటిచెట్లపాలెం: నియోజకవర్గంలోని సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నరసింహనగర్, కైలాసపురం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల రహదారులు ఇరుగ్గా మారిపోయాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నో అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లు ఉన్నాయి. వీటిలో నివసించే వారికి మాత్రం వాహనాలు పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కూడా లేదు. చాలా ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల నివాసుల వాహనాలకు మాత్రం పార్కింగ్ ఏరియా లేకుండా పోయింది. దీంతో పలు అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌ల నివాసులు తమ ద్విచక్ర వాహనాలు, కార్లను రోడ్లపైనే పార్క్‌చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కొందరు ట్రావెల్స్ యజమానులు తమ వాహనాలను రోడ్ల పక్కనే నిలిపి ఉంచుతున్నారు. దీని వల్ల విశాలమైన రోడ్ల కాస్తా.. ఇరుగ్గా మారుతున్నాయి.

నిత్యం ట్రాఫిక్ తంటాలు

తాటిచెట్లపాలెం – అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ వంటి ప్రాంతాల్లోని విశాల రహదారులు రాంగ్ పార్కింగ్, ఆక్రమణలతో కుచించుకుపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్ నుంచి మహారాణి పార్లర్ వరకు రహదారికి ఇరువైపులా కమర్షియల్ షాపులు, తోపుడు బళ్లు, వీధి వ్యాపారాలు, భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు సాగిస్తున్నారు. వీటికి తోడు కదల్లేని, మెదల్లేని పాత వాహనాలు దారంతా పడి ఉన్నాయి. కొన్ని చోట్ల తోపుడు బళ్లు, వీధి వ్యాపారులు రోడ్డెక్కి వ్యాపారాలు చేస్తున్నారు. దీని వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పలువురు స్థానికులు చెబుతున్నారు.

జీవీఎంసీది అదే తీరు..

ప్రైవేట్ వ్యక్తులు, అపార్ట్‌మెంట్ల వాసులు, వీధి వ్యాపారులు ఇలా రోడ్లను ఆక్రమిస్తుంటే.. తామేం తక్కువ కాదంటూ జీవీఎంసీ సిబ్బంది కూడా వ్యవహరిస్తున్నారు. రహదారుల పక్కన ఎవరికీ ఆటంకాలు లేకుండా ఉంచాల్సిన డంపర్, డస్ట్ బిన్‌లను రోడ్డు మధ్యలో, రోడ్డు మీద ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పక్కనే గల సర్వీస్ రోడ్డులో నిత్యం డంపర్ బిన్‌లు రోడ్డు మధ్యలో ఉంటున్నాయి. ఇదే అదునుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు వారి వాహనాలను సైతం వీటితో పాటుగా నిలిపి ఉంచుతున్నారు. ఈ కారణంగా అసలే చిన్నదైన ఈ రోడ్డు మరింతగా కుచించుకుపోయింది. వాహనదారులు ఈ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అసలే జాతీయ రహదారి పక్కనున్న సర్వీస్ రోడ్డు కావడంతో ఒన్ వేలో వచ్చే వాహనాలు ప్రయాణించే ఈ మార్గంలో డంపర్ బిన్‌లు, ప్రైవేట్ వాహనాలను ఉంచి రోడ్డును ఇరుగ్గా మార్చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పోర్టు స్టేడియం పక్కన రోడ్డు మధ్యలో డస్ట్ బిన్లు

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

తాటిచెట్లపాలెం: కూటమి పాలన ప్రారంభమై సుమారు 13 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైంది. దీనిని నిలదీసేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం 24వ వార్డులో జరగనుంది. జయభేరి ఆటోమొబైల్స్ షోరూం డౌన్‌లోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు


వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం విశేష సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం

- 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర'లో వక్తలు


జ్ఞాన నికేతన్ స్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతంపేట: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లోని జ్ఞాన నికేతన్ స్కూల్‌లో 'ప్లాస్టిక్‌ను నిరోధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి నిర్వహించారు. ముందుగా వార్డు మెంబర్ ముక్క కిషోర్ మాట్లాడుతూ ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని, తడి, పొడి చెత్తలను వేరు చేయడం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి

తాటిచెట్లపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, పనికిరాని వస్తువులు, చెత్తను సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గణపతి, వరలక్ష్మి, కనకరాజు, వరహాలు, సుమన్, ప్రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

నార సంచులు వాడాలి

సీతమ్మధార రైతుబజార్‌లో పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ సంచులను నిషేధిస్తామని వినియోగదారులు, రైతుల చేత జీవీఎంసీ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్‌కు బదులుగా క్లాత్ లేదా నార సంచులను వాడాలని అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిరోధిద్దాం..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట హైస్కూల్‌లో ప్లాస్టిక్‌ను నిరోధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈస్ట్ పార్క్‌లో..

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్క్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల సంభవించే అనర్థాలను స్థానికులకు వివరించారు. ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సచివాలయ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.


సీతమ్మధార రైతుబజార్‌లో నినాదాలు చేస్తున్న జీవీఎంసీ అధికారులు, బజార్ సిబ్బంది


ఆర్పీ పేట హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, స్థానికులు

తిక్కవానిపాలెం సమస్యలు పరిష్కరించాలని వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జి.వి.రవిరాజ్, గంటా కామరాజు, ఎస్.వి.రమణ, జి.బి.వై.కుమార్ నేతృత్వంలో స్థానికులు శనివారం రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తిక్కవానిపాలెంలో ప్రధాన రహదారి రైల్వే స్థలానికి చెందినది కావడంతో అభివృద్ధి చేయడం లేదని, రైల్వే క్వార్టర్ల సమీపంలో తిక్కవానిపాలెం, గంగన్ననగర్, జోగారావు నగర్ ప్రాంతాల రహదారులు అనేక ఏళ్లుగా శిథిలావస్థలో ఉండటంతో గ్రామంలోకి రాకపోకలు సాగించే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, గంగన్ననగర్‌లో శాశ్వత కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ నిధులతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు విన్నవించారు. ప్రపంచ బాక్సర్ ఎస్.ఉష నేతృత్వంలో త్వరలో జరిగే ఉత్తరాంధ్ర బాక్సింగ్ టోర్నమెంట్ ఆహ్వాన పత్రికను ఎంపీకి అందజేశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.


రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గంటా కామరాజు, పార్టీ నాయకులు

చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ జోన్ 3, 5ల పరిధిలో అక్రమ భవన నిర్మాణాలపై 'అడ్డగోలుగా నిర్మాణాలు' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్ స్వయంగా సాక్షిలో ప్రచురించిన ప్రతి అక్రమ నిర్మాణాన్ని సంబంధిత ఏసీపీలు, ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి పరిశీలించారు. భవనాలకు సంబంధించిన ప్లాన్‌లు పరిశీలించి డీవియేషన్, అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మించినట్టు గుర్తించారు. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఏసీపీలను ఆదేశించారు. 43వ వార్డులోని అక్రమ నిర్మాణాలపై జోన్–5 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి స్పందించారు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి 'సాక్షి'కి వివరణ విడుదల చేశారు. అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద రెండడుగుల రోడ్‌లో నిర్మిస్తున్న భవనం, నందగిరినగర్ చెక్కుడురాయి బిల్డింగ్ రోడ్డులో నిర్మిస్తున్న భవనాలు సెట్ బ్యాక్ డీవియేషన్ ఉన్నట్టు గుర్తించామని, వారికి నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. సంగం ఆఫీస్ రోడ్డులోని 45–33–25 డోర్ నంబరు పక్కన జీ ప్లస్ 2కు అనుమతి తీసుకుని అదనంగా మరో అంతస్తు నిర్మించినందున నోటీసులు జారీ చేశామన్నారు. అదనపు అంతస్తుపై చర్యలు చేపడతామని చెప్పారు.

మెగా జాబ్ మేళాకు స్పందన

సీతంపేట: స్థానిక శంకరమఠం రోడ్డులోని డాటాప్రో కంప్యూటర్స్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన సుమారు 20కు పైగా కంపెనీలు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశాయి. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, టెక్ మహీంద్రా, కాన్సెంట్రిక్స్, డబ్ల్యూఎన్ఎస్, స్టడీ కనెక్ట్, ఫ్యూజెస్, క్వెస్, డిక్సన్, వరుణ్ మోటార్స్, హ్యుండయ్, మోబిస్, అపోలో ఫార్మసీ, డెక్కన్, డైకిన్, జోస్ట్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంటర్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా ప్రతి ఏటా సంస్థ వార్షికోత్సవం రోజున మెగా జాబ్‌మేళా నిర్వహించి, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ కిశోర్ వర్మ, డైరెక్టర్లు రంగినేని సాయిప్రసాద్, సిద్ధవరావు పాల్గొన్నారు.


విద్యార్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఓ కంపెనీ ప్రతినిధులు

'దాట్ల'కు రావిశాస్త్రి సాహిత్య పురస్కారం

సీతంపేట: రావిశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది యానాంకు చెందిన కథా రచయిత దాట్ల దేవదానం రాజుకు అందజేస్తున్నట్లు రావిశాస్త్రి ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ప్రసిద్ధ కథా రచయిత రావిశాస్త్రి జయంతిని పురస్కరించుకుని ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో దాట్లకు పురస్కార ప్రదానం జరగనుందని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు, సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు వెల్లడించారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలను హతమార్చడం ఆపాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరసం ప్రతినిధి పినాకపాణి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మూడు నెలలుగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష, విప్లవ శక్తులు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్ ప్రారంభించిందని తెలిపారు. మావోయిస్టుల ఆధ్వర్యంలో ఆదివాసీలు దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండ మావోయిస్టులకు మాత్రమే సంబంధించినది కాదని, ప్రజలందరూ దీనిపై స్పందించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు రాకపోవడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి వి.ఎస్.కృష్ణ, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఊబర్ కార్యాలయాన్ని ముట్టడించిన డ్రైవర్లు


రేసపువానిపాలెంలోని ఊబర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: ఊబర్ సంస్థలో కొన్నేళ్లుగా వాహనాలు నడుపుతున్న క్యాబ్ డ్రైవర్లు తమ ఖాతాలు ఓపెన్ చేయాలని కోరుతూ శనివారం రేసపువానిపాలెంలోని ఊబర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎంతో కాలంగా తమ వాహనాలను ఊబర్‌లో నడుపుతుంటే ఇటీవల ఆ సంస్థ మేనేజర్ యశ్వంత్ తానే స్వయంగా 40 కార్లు కొని నడుపుతున్నారని, ఈ కారణంగా ఈ వృత్తినే నమ్ముకున్న తమ అకౌంట్లు మూసేసి, తమకు వ్యాపారం లేకుండా చేసి అన్యాయం చేసినట్లు వీరు ఆరోపించారు. ఈ విషయమై మేనేజర్‌ను అడగ్గా.. 'మీ అకౌంట్స్ ఎప్పటికీ ఓపెన్ కావు. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని దురుసుగా సమాధానమిచ్చినట్లు తెలిపారు. ఊబర్ మేనేజర్ యశ్వంత్‌పై నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు డ్రైవర్లు చెప్పారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేసి డ్రైవర్ల కోరిక మేరకు తమ అకౌంట్లు ఓపెన్ చేయాలన్నారు. 12 ఏళ్లుగా ఆన్‌లైన్ వ్యాపారాన్నే నమ్ముకున్న తమకు అన్యాయం చేయడం తగదని వాపోయారు. వ్యాపారాలు లేక ఈఎంఐలు, ఇంటి అద్దెలు కట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులతో తాము, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు కూడా వినతిపత్రం సమర్పించినట్లు డ్రైవర్లు తెలిపారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైన్స్ ఫెస్ట్


విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం బయో బ్లూమ్–25 ఇంటర్ సైన్స్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథి, ఫిషరీష్ సైంటిస్ట్ జి.వి.ఎ.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీలు ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు సరికొత్త ఆవిష్కరణలకు దోహదపడతాయని అతిథులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, కో ఆర్డినేటర్ డాక్టర్ ఇ.హరిణి, పి.కె.జయలక్ష్మి, స్నేహ, రోసినా జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం


మద్యం బాటిల్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్పీ ప్రసాద్

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెంలో విదేశీ మద్యంతో వ్యాపారాన్ని చేస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ శాఖ సిబ్బంది పక్కా సమాచారంతో పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 149 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఎస్పీ ప్రసాద్ వెల్లడించిన వివరాలిలా.. అక్కయ్యపాలెంలో 13 రోజుల కిందట తిరుపతి వెంకటేష్ అనే వ్యక్తి కాస్మోటిక్స్ వ్యాపారం చేస్తుంటానని అద్దెకు దిగాడు. ఇతడు మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఉంచారు. శనివారం రాత్రి మద్యం బాటిళ్లను కస్టమర్లకు ఇచ్చేందుకు తీసుకువెళ్తున్న సమయంలో పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా అతడిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.ఈ బాటిళ్లను చెన్నై నుంచి తీసుకొచ్చినట్లు నిందితుడు విచారణలో తెలిపాడు. ఈ వ్యక్తిపై ఏడాది కిందట ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసిందని, ఈ విషయమై కూడా విచారిస్తున్నట్లు ఎస్పీ ప్రసాద్ చెప్పారు. ఈ బాటిళ్లు విదేశీ మద్యమా? లేదా ఏమైనా కల్తీనా అనేది తేలాల్సి ఉందని, వీటిని పరీక్షల కోసం పంపుతున్నట్లు తెలిపారు.